
AP 4PG 14 12 2025 SUNDAY qxp_Layout 1 14-12-2025 06:14 AM Page 1

విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక






# అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నాం

## గుమ్మగట్టలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం , డిసెంబర్ 13 (అనంత ప్రభ )
రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. గుమ్మగట్ట మండల కేంద్రం, తాళ్ళకేర ప్రాంతాల్లో శనివారం ఆయన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గుమ్మఘట్ట మండలం తాళ్లకేర గ్రామంలో నూతన పి. హెచ్. సెంటర్ నిర్మాణానికి, తాళ్లకేర నుండి తిమ్మలాపురం వరకు సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం గుమ్మఘట్ట మండల కేంద్రంలో మండల రిసెర్చ్ సెంటర్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని ఆరోపించారు. రూ. 10 లక్షల కోట్లపైగా ఆర్థిక భారాన్ని రాష్ట్రంపై మోపారని ధ్వజమెత్తారు. స్వార్థ ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా అటకెక్కించారని విమర్శించారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక కనీసం ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని, ప్రభుత్వాన్ని నడపలేని దయనీయ పరిస్థితిని సృష్టించారని తెలియజేశారు. ఇలాంటి పరిస్థితుల్లో తన పాలన అనుభవం, ప్రజలకు సేవ చేయాలన్న దృఢ సంకల్పంతో చంద్రబాబు ఓవైపు సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే... అభివృద్ధిని వేగవంతం చేశారన్నారు. ఏడాదిన్నర పాలనలో దాదాపు రూ. 50 వేల కోట్ల పించన్ల కిందనే అందజేయడం గొప్ప విషయమన్నారు. పెన్షన్ ఒకేసారి రూ. 4వేలకు పెంచడంతో పాటు ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు ఇవ్వడం, అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ. 20 వేల ఆర్థిక సహాయం అందజేయడం, తల్లికి వందనం కింద ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ. 15వేల ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. వీటితో స్త్రీ శక్తి కింద బాలికలకు,మహిళలకు ఆర్టీసీ సర్వీసులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. అత్యంత వెనుకబడిన గుమ్మగట్ట మండలంలో... బీటీపీ కాకుండా దాదాపు రూ. 17కోట్ల విలువైన రహదారులు, భవనాలకు నిధులు మంజూరు చేయించామన్నారు. ఇందులో సిమెంట్, తారు రోడ్లు, మురుగునీటి కాలువలు, భవనాలతో పాటు గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు అత్యధికమైన ప్రాధాన్యమిస్తూనట్లు తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ నుంచి వచ్చే నిధులు, ఉపాధి హామీ కింద కొంత డబ్బులు ఇవన్నీ జత చేసి పెద్ద ఎత్తున ఈ రోజు గ్రామాల్లో గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా తాళ్లకెరలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు, గుమ్మగట్టలో మండల రిసోర్స్ సెంటర్కి శనివారం శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు.



వెనుకబడ్డ ప్రాంతాభివృద్ధికి చంద్రబాబు పెద్దపీట...

చంద్రబాబు నాయుడుకి వెనుకబడిన ప్రాంతాల పట్ల ఉన్న ప్రత్యేక శ్రద్ధ, మరీ ముఖ్యంగా రాయదుర్గం బాగుపడాలనే భావన వల్ల ఇవన్నీ తెచ్చుకోగలుగుతున్నామని పేర్కొన్నారు. తాళ్లకేర గ్రామంలోనే రూ. 3.50కోట్లు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూన్నామన్నారు. మొదట రూ. 1.40కోట్లతో రోడ్ మంజూరు చేయించామన్నారు. అధికారుల సూచన మేరకు అదే పనిని రూ. 50లక్షలుగా విడదీసి మళ్ళీ మంజూరు చేసుకొన్నామనీ వివరించారు. రూ. 1.94కోట్లతో హాస్పిటల్, రూ. 17.5లక్షలతో వెల్నెస్ సెంటర కడుతున్నట్లు చెప్పారు. ఇదివరకే తాళ్లకెర, కోనాపురంలో సీసీ రోడ్ వేశారని తాజాగా మరో %తీం%.27.50 లక్షలతో కొత్త సీసీ రోడ్లకు ప్రతిపాదనలు పంపామన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో రాజీపడం.

ప్రజలు ప్రధానంగా తమ కుటుంబంతో ప్రశాంతంగా జీవించాలని కోరుకొంటారన్నారు. అలాగే ప్రభుత్వం నుండి తగిన రక్షణ ఆశిస్తారన్నారు. రెండోది సంక్షేమం, మూడోది అభివృద్ధి వారికి ముఖ్యమన్నారు. ప్రజలు ఆశలు ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ప్రశాంత వాతావరణంతో పాటు తగిన రక్షణ, సంక్షేమం, అభివృద్ధి వారికి అందిస్తుందన్నారు. ఈ
మూడు విషయాల్లోనూ రాయదుర్గం ఆదర్శంగా నిలుస్తోందని హర్షం వ్యక్తపరిచారు. ఎవరి భూములు వారు దున్నుకొని పంటలు పెట్టుకుంటూ పిల్లా పాపలతో ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. ఏ ఒక్క గ్రామంలోనూ కక్షలు, కార్పన్యాలు, రాజకీయ గొడవలు లేవన్నారు. ఒకరిపై మరొకరి దౌర్జన్యాలు, బెదిరింపులకు ఆస్కారం లేకుండా చేశామన్నారు. తనకు తెలిసి వైసీపీ పాలనలో కంటే కూటమి పరిపాలనలోనే వైసీపీ కార్యకర్తలు కూడా ప్రశాంతంగా ఉంటారన్నారు. అంత గొప్ప పరిపాలన కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అందుతుందన్నారు. ప్రజలు మెచ్చిన, నచ్చిన మంచి పరిపాలన ఇస్తున్న చంద్రబాబు నాయుడు కూటమే ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కాలవ విజ్ఞప్తి చేశారు.

రెండేళ్లలో పాఠశాల భవనం నిర్మిస్తాం..

గుమ్మగట్ట వద్ద ప్రత్యేక భవనాన్ని నిర్మించి అందరికి అక్కడ వసతి ఏర్పాటు చేయాలని ప్రయత్నం చేస్తున్నామని గుమ్మగట్ట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే సూచించారు. ఇదివరకే భవన నిర్మాణం గురించి కలెక్టర్కు వివరించడం జరిగిందన్నారు. ఆయన కూడా సుముఖత వ్యక్తం చేశారన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ప్రస్తుతానికి ఈ షెడ్లల్లోనే ఉంచాల్సి వస్తుందని వివరించారు. రాబోయే రెండేళ్లలో తప్పకుండా భవన నిర్మాణాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. చదువుకుంటున్న విద్యార్థులందరికీ మంచి వసతి కల్పించాలనది తమ అందరి ఆకాంక్షని తెలిపారు. స్థానికంగా అరకొర వసతుల మధ్యనే పిల్లలు బాగా చదువుకుంటూ విద్యలో రాణిస్తుండటం ఆనందంగా ఉందన్నారు. ఒక అమ్మాయి అయితే 95% మార్కులు సాధిస్తానని చెప్పడం ఆమె ధీమాను మనమంతా అభినందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కాలవ సన్నన్న, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ దానవేంద్ర, మాజీ కన్వీనర్ కురుబ గిరిమల్లప్ప, సర్పంచ్ విజయ లక్ష్మి, నాగరాజు, పోట్ల రవి, సదాశివ , రాము, చిన్ని కృష్ణ, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఉరవకొండలో కౌలు రైతుల గర్జన

ఉరవకొండ, డిసెంబర్ 13 (అనంత ప్రభ )
ఉరవకొండ మండలం లత్త వరం గ్రామంలో శనివారం కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం కౌలు రైతుల సమస్యలపై పోరాటానికి నాంది పలికింది. పోలేరమ్మ దేవాలయ ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తమైంది.
సమావేశంలో మాట్లాడిన కౌలు రైతు సంఘం నాయకుడు వెంకటేశు లు మాట్లాడుతూ, సీసీఆర్సీ కార్డు కలిగిన ప్రతి కౌలు రైతుకూ బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని, పంట ఈ-క్రాప్ నమోదు ఎలాంటి అడ్డంకులు లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద కౌలు రైతులకు కూడా రూ. 20,000 ఆర్థిక సహాయం అందించాల్సిందేనని స్పష్టం చేశారు.
పంట నష్టపోతే ఇన్పుట్ సబ్సిడీ, పంటల బీమా వర్తింపజేయాలని, ఎరువులు, మందులు, నాణ్యమైన విత్తనాలు కౌలు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. నూతన కౌలు రైతు సంఘం చట్టాన్ని వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.
ఈ సమావేశానికి హాజరైన కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ. రంగారెడ్డి మాట్లాడుతూ, కౌలు రైతులు సంఘటితంగా పోరాటం చేపట్టినప్పుడే హక్కులు సాధ్యమవుతాయని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశు



ద్ధి లేకపోతే రానున్న రోజుల్లో పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు.
ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి. శివ, కార్యదర్శిగా ఎం. ధనుంజయ, సహాయ కార్యదర్శిగా సి. శ్రీనివాసులు, కోశాధికారిగా విజయ్ కుమార్లను ఎన్నుకున్నారు.
ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నియోజకవర్గ నాయకులు సురేష్, వెంకటేష్, మండల నాయకుడు సుంకన్నతో పాటు సభ్యులు రామాంజనేయులు, లక్ష్మీదేవి, రేవతి, అరుణమ్మ, లాల్ స్వామి, గోవిందా నాయక్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధర్మవరంలో నిరుద్యోగ యువతకు ఉచిత బ్యాంక్ కోచింగ్

ధర్మవరం, డిసెంబర్ 13 (అనంత ప్రభ )
ధర్మవరం నియోజకవర్గంలోని నిరుద్యోగ, ప్రతిభావంతులైన యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సంస్కృతి సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత బ్యాంకింగ్ కోచింగ్ కార్యక్రమం విజయవంతంగా ముందుకు సాగుతోంది.
ఈ కార్యక్రమంలో భాగంగా, నేడు సంస్కృతి సేవా సంస్థ కార్యదర్శి శ్రీ ఒంటేరు శ్రీనివాస్ రెడ్డి గారు, ధర్మవరం నుండి ఎంపికైన 12 మంది ప్రతిభావంతులైన విద్యార్థినులకు ఒక నెలకు హాస్టల్ భోజన సదుపాయాల నిమిత్తం రూ. 42,000/- విలువైన చెక్కును నంద్యాల జిల్లా 'గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సంస్థ' నిర్వాహకులకు అందజేశారు.

ఒక సంవత్సరం పాటు సంపూర్ణ ఉచిత సదుపాయాలు
సంస్కృతి సేవా సంస్థ తరపున:
12 మంది ఎంపికైన విద్యార్థినులకు
ఒక సంవత్సరం పాటు ఉచిత బ్యాంకింగ్ కోచింగ్,
ఉచిత వసతి మరియు భోజన సదుపాయాలు,
అనుభవజ్ఞులైన అధ్యాపకులచే నాణ్యమైన శిక్షణ
అందిస్తూ, వారు బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం సాధించే విధంగా పూర్తి స్థాయిలో




ప్రోత్సాహం మరియు మార్గనిర్దేశం అందిస్తున్నారు.
మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి ప్రేరణతో కార్యక్రమం
ఈ శిక్షణా కార్యక్రమం రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీ సత్య కుమార్ యాదవ్ గారి ప్రేరణతో అమలులోకి వచ్చింది. యువతకు విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి అవసరమని, ప్రత్యేకించి గ్రామీణ మరియు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినులకు సరైన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని మంత్రి గారు స్పష్టంగా తెలియజేస్తూ ఈ కార్యక్రమానికి సత్యకుమార్ గారు పూర్తి మద్దతు అందిస్తున్నారు.

## సీఐటీయూ మహాసభలు పోస్టర్ ఆవిష్కరణ

ఉరవకొండ, డిసెంబర్ 13 (అనంత ప్రభ )
సీఐటీయూ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు జరగనున్న 18వ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ శుక్రవారం ఉరవకొండ మండలంలో ఆలిండియా మహాసభల పోస్టర్ను ఆవిష్కరించారు.
ఈ కార్యక్రమాన్ని సీఐటీయూ, హమాలీ యూనియన్, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.వి. నాయుడు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కృష్ణమూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గంపై దాడి చేసే విధంగా విధానాలు అమలు చేస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్స్ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం చట్టబద్ధంగా అమలు చేయాలని, కనీస వేతనం నెలకు రూ. 26,000గా నిర్ణయించాలని స్పష్టం చేశారు. ఎల్లతరబడి పంచాయతీ కార్మికులు పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమై ఉన్నప్పటికీ, వారికి పీఎఫ్, ఈఎస్ఐ వంటి మౌలిక హక్కులు అమలు



కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ అమలు అయ్యే వరకు ఉద్యమాలను నిరంతరం కొనసాగిస్తామని హెచ్చరించారు. అలాగే రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ చట్టం కింద సంవత్సరానికి 200 రోజులు పని, రోజుకు రూ. 600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు టీ. గోపాలు, బి. గోవిందు, ఎం. గోవిందు, జె. ఓబులేసు, ఎం. నాగేంద్ర, టీ. సంజప్ప, కౌలు రైతు సంఘం నియోజకవర్గ నాయకులు వెంకటేశులు, సుంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మురళితో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యోగుల ఐక్యతకు క్రికెట్ పోటీలు - ఫాదర్ ఫెర్రర్ ఉద్యోగస్తుల క్రికెట్ టోర్నీ

అనంతపురం, డిసెంబర్ 13 (అనంత ప్రభ )
ఉద్యోగుల ఐక్యత కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగస్తులకు ప్రత్యేక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం ఉద్యోగులకు స్ఫూర్తినిస్తుందని ఏపీ వెటర్నన్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి అన్నారు అనంతపురం జిల్లా వెటర్నన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫాదర్ ఫెర్రర్ ఎంప్లాయిస్ క్రికెట్ టోర్నమెంట్ సెమీఫైనల్ పోటీలు ఆర్డిటి మైదానంలో ప్రారంభమయ్యాయి ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మచ్చా రామలింగారెడ్డి గౌరవ అతిథిగా యుగంధర్ రెడ్డి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి, ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయరాజు జాయింట్ సెక్రెటరీ శ్రీధర్ ఇతర అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అనంతపురం జిల్లాలో ఉద్యోగుల కోసం ఒక ప్రత్యేక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని నిత్యం పనిఒత్తిడిలో ఉన్నటువంటి ఉద్యోగులకు ఇటువంటి పోటీలు నిర్వహించడం ద్వారా వారిలో నూతన ఉత్సాహాన్ని నింపడానికి ఎంతగానో ఉపయోగపడతాయని మచ్చా అన్నారు జిల్లాలోని 20 టీములు ఉద్యోగస్తుల క్రికెట్ జట్లు ఈ పోటీల్లో పాల్గొనడం ఒక మంచి పరిణామం అని ఇది ఇతర జిల్లాలకు కూడా స్ఫూర్తినిస్తుందని ఇటువంటి పోటీలు నిత్యం నిర్వహించడం ద్వారా ఉద్యోగులకు



ఎంతగానో ఉపయోగపడతాయని క్రికెట్ క్రీడ కూడా స్ఫూర్తినిస్తుందని మచ్చా అన్నారు జిల్లా కార్యదర్శి యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగులకు ప్రత్యేక టోర్నమెంట్ నిర్వహించడం గత 30 సంవత్సరాలుగా మచ్చా రామలింగారెడ్డి నాయకత్వంలో ఈ టోర్నమెంట్ జరుగుతున్నాయని ఇది ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు మొదటి సెమి ఫైనల్ మ్యాచ్ గుంతకల్ రైల్వే జట్టు, కదిరి టీచర్స్ జట్లు మధ్య సెమీఫైనల్ పోటీని మచ్చా రామలింగారెడ్డి బ్యాటింగ్ చేసి లాంఛనంగా ప్రారంభించారు ఈ కార్యక్రమంలో అంపైర్లు వెంకటేష్ నవీన్ సీనియర్ క్రికెటర్లు వెటర్నన్స్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు రేపు ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఉంటుందని అనంతరం విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందని ఆర్గనైజింగ్ సెక్రటరీ కె. విజయరాజు తెలిపారు

AP 4PG 14 12 2025 SUNDAY qxp_Layout 1 14-12-2025 06:14 AM Page 2



## శ్రీ కొత్త వెంకటరమణ స్వామి ఆలయ అభివృద్ధికి భక్తుల విరాళాలు



యాడికి, డిసెంబర్ 13 (అనంత ప్రభ )
యాడికి మండలము కమలపాడు పంచాయతీలో స్వయంభుగా వెలసిన శ్రీ కొత్త వెంకటరమణ స్వామి ఆలయంలో ధ్వజస్తంభం పునర్నిర్మాణం మరియు ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన వాస్తవ్యులు ఆదినారాయణ రెడ్డి ఆలయ అభివృద్ధి కోసం రూ. 51,116 విరాళంగా అందజేశారు. అలాగే కీర్తిశేషులు రవ్వ రంగయ్య ధర్మపత్ని విజయలక్ష్మి రూ. 50,000/- విరాళంగా ఆలయ కమిటీ వారికి అందజేశారు. వార్త పత్రికల్లో ఇటీవల కొత్త వెంకటరమణ స్వామి ఆలయానికి సంబంధించిన వార్తలు ప్రచురితమవడంతో భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. భక్తుల ఆదరణను దృష్టిలో ఉంచుకుని ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగిస్తున్నామని వారు వెల్లడించారు. ఈ సందర్భంగా విరాళాలు అందజేసిన దాతలకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు

## అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేసిన బంగారు బాల



యాడికి, డిసెంబర్ 13 (అనంత ప్రభ )
యాడికి మండల కేంద్రానికి చెందిన గాదంశెట్టి బలరామయ్య (బంగారు బాల) కుమారుడు మద్దిలేటి సాయి జన్మదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో దాదాపు 400 మంది అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో బంగారు బాల, లక్ష్మి, అల్లుడు మంజునాథ్, లావణ్యతో పాటు గాదంశెట్టి వంశానికి చెందిన కుటుంబ సభ్యులందరూ పాల్గొని సేవాభావంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తులు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు

## లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదానం



యాడికి, డిసెంబర్ 13 (అనంత ప్రభ )
యాడికి మండలం రాయలచెరువు గ్రామంలోని లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి తెలిపారు. యాడికి మండలం భోగాల కట్ట గ్రామానికి చెందిన కుమ్మెత ప్రతాపరెడ్డి కుమ్మెత భవానీ దంపతుల కూతురు స్వప్న దుర్గ మొదటి జన్మదినం సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు ఆ కుటుంబ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి మరియు ఆశ్రమంలోని వృద్ధులు పుట్టినరోజు జరుపుకుంటున్న స్వప్న దుర్గకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు

## బి.ఫార్మసీ పట్టాతో పాటు గోల్డ్ మెడల్ సాధించిన ఎస్.కె. పట్ట శంషుద్దీన్



ఉరవకొండ, డిసెంబర్ 13 (అనంత ప్రభ )
నెల్లూరు పట్టణంలోని జగన్స్ కాలేజీలో బి.ఫార్మసీ కోర్సును అత్యుత్తమ ప్రతిభతో పూర్తి చేసిన ఉరవకొండకు చెందిన వైయస్సార్ నిజం పెద్ద కుమారుడు ఎస్.కె. పట్ట శంషుద్దీన్ శనివారం గోల్డ్ మెడల్‌తో పాటు బి.ఫార్మసీ పట్టాను అందుకుని ఉరవకొండ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు.

విద్యాభ్యాసంలో నిరంతర కృషి, క్రమశిక్షణ, అంకితభావంతో అత్యుత్తమ ఫలితాలు సాధించినందుకు కాలేజ్ యాజమాన్యం ఆయనను ఉత్తమ విద్యార్థిగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన పట్టాభిషేక కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా గోల్డ్ మెడల్, పట్టా అందజేశారు. ఈ వేడుకలో కాలేజ్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం శంషుద్దీన్‌ను అభినందిస్తూ ఆయన విద్యా ప్రస్థానం మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించి, కుమారుడి విజయంలో వారి పాత్రను ప్రశంసించారు.

కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సహ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని శంషుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, ఈ విజయం ఉరవకొండ యువతకు ఆదర్శంగా నిలుస్తుందని, పట్టుదలతో చదువుకుంటే జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## ఉరవకొండలో గొర్రెలు - పొట్టేళ్ల పెంపకంపై అవగాహన సదస్సు




ఉరవకొండ, డిసెంబర్ 13 (అనంత ప్రభ )
ఉరవకొండ నియోజకవర్గంలోని మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా శుక్రవారం ఉరవకొండ వెలుగు కార్యాలయంలో గొర్రెలు మరియు పొట్టేళ్ల పెంపకం దారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ఈ కార్యక్రమం కీలకంగా నిలిచింది.

ఈ అవగాహన సదస్సులో మహిళలు తమ వద్ద ఉన్న నైపుణ్యాలు, ఈ ప్రాంతంలో ఇప్పటికే అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), జీవనోపాధి కార్యక్రమాలను అమలు చేయడంలో ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా గొర్రెలు, పొట్టేళ్ల పెంపకం ద్వారా ఆదాయం పెంచుకునే మార్గాలపై స్పష్టత కల్పించారు. అదేవిధంగా, గొర్రెలు మరియు పొట్టేళ్ల పెంపకాన్ని మరింత మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించారు. మీట్ మరియు లెదర్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, మార్కెటింగ్ సౌకర్యాల కల్పన, ఉత్పాదకత పెంపు, వ్యాక్సినేషన్ సదుపాయాలు, గ్రేజింగ్ అందుబాటు, షెడ్ల నిర్మాణం వంటి అంశాలపై డైరెక్టర్లతో సమగ్రంగా చర్చించారు. ఉత్పత్తిదారులను భాగస్వాములుగా మార్చే విధానాలపై కూడా అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో సెర్ప్ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) నుంచి ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ బి. శ్రీనివాసులు, విజయ వాహిని ఫౌండేషన్ (టాటా ట్రస్ట్) నుంచి సి. వాసు, శంకర్ నాయక్, జిల్లా జీవనోపాధుల విభాగం ప్రాజెక్ట్ మేనేజర్ బి. గంగాధర్ పాల్గొని కీలక సూచనలు చేశారు. అలాగే ఉరవకొండ నియోజకవర్గంలోని వెలుగు ఏపీఎంలు, సీసీలు, వివోఏలుతో పాటు సంబంధిత అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో ఈ అవగాహన సదస్సులో

## రక్తదానం నుంచి అంత్యక్రియల వరకు సేవలు అందిస్తున్న యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్



యాడికి, డిసెంబర్ 13 (అనంత ప్రభ )
సమాజ సేవలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా తమ సేవలను నిరంతరం కొనసాగిస్తున్న యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ మరోసారి మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. యాడికి మండలం నుంచి సుమారు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న పుట్లూరు మండలం కొడవండ్లపల్లి గ్రామంలోని వృద్ధురాలు గుడిసెల నాగలక్ష్మి దేవి అనారోగ్యంతో మృతి చెందగా అంత్యక్రియలు నిర్వహించడానికి ఎవరూ లేరన్న సమాచారాన్ని తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు వెంటనే స్పందించి మృతురాలి అంత్యక్రియలను పూర్తి చేశారు. మేము ఫోన్ చేసిన వెంటనే స్పందించి మా అక్క అంత్యక్రియలను పూర్తి చేసినందుకు వృద్ధురాలు తమ్ముడు జయచంద్ర నాయుడు యాడికి ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రెసిడెంట్ బండారు బాలకృష్ణ మాట్లాడుతూ, మా ఫౌండేషన్‌లో అంత్యక్రియల సేవలతో పాటు ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం కూడా ముఖ్యమైన కార్యక్రమము అని, ఎవరికైనా రక్తం అవసరమైనప్పుడు మా ఫౌండేషన్ వారిని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతా నరసింహ, సాకరే శంకరప్ప, బోయ అశోక్ తదితర ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు

## నన్ను నమ్మి నాకు స్టేట్ కమిటీలో మాజీ మునిసిపల్ చైర్మెన్ జింకాల రామాంజనేయులు



గుంతకల్లు, డిసెంబర్ 13 (అనంత ప్రభ )
గుంతకల్లు వై. ఎస్. ఆర్. సి. పి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ జాయింట్ సెక్రటరీ గా నియమించునందుకు మాజీమునిసిపల్ చైర్మెన్ జింకాల రామాంజనేయులు మరియు రాజశేఖర్, కొండా రాఘవేంద్ర, గోపాల్ కృష్ణ మరియుగుంతకల్లు నియోజకవర్గం వై. ఎస్. ఆర్. పార్టీ నాయకులు ఈరోజుతాడేపల్లి గూడెం పార్టీ కార్యాలయం లో మాజీ ముఖ్యమంత్రి వై. ఎస్. ఆర్. పార్టీ నాయకులు జగన్మోహనరెడ్డి ని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. నాకు స్టేట్ కమిటీలో నాకు పదవి ఇచ్చినందుకు గుంతకల్లు వై. ఎస్. ఆర్. పార్టీ మాజీ యమ్. యల్. ఏ. వెంట్రామిరెడ్డి గారికి మరియు మా పార్టీ నాయకులు జగన్ మోహనరెడ్డి గారికి నాకు ఈ పదవి ఇచ్చినందుకు నన్ను మెచ్చి పార్టీ కోసం నా సాయశక్తులు శ్రమ పడి నా వంతుగా పార్టీ కోసం పని చేస్తాను అంటూ పత్రిక ముకంగా తెలిపారు. ఈ కార్యక్రమం లో గుంతకల్లు నియోజకవర్గం పార్టీ కర్తలువార్డ్ మెంబెర్ల పాలుగోన్నారు.

## లోక్ అదాలత్ లో 164 కేసులు పరిష్కారం



పుట్టపర్తి, డిసెంబర్ 13 (అనంత ప్రభ )
రాజీ కాదగ్గ కేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కారం చూపుతుందని పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్ పిలుపునిచ్చారు. శనివారం జూనియర్ సివిల్ జడ్జి అధ్యక్షతన పుట్టపర్తి లో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా ఐ పి సి (సిసి కేసులు 50 మద్యం సిసి కేసులు 69 చెక్ బౌన్స్ కేసులు 3 (మెయింటైన్స్ )కేసులు 2 బాంక్ పి ఎల్ సి కేసులు 2 ఎస్ టి సి పెట్టి కేసులు 38 కేసులతో కలుపుకొని లోక్ అదాలత్ లో 164 కేసులు పరిష్కరించబడ్డాయి. సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ రాజీ కాదగ్గ కేసులకుచక్కటి పరిష్కార వేదికగా లోక్ అదాలత్ ను అభివర్ణించారు. . కేవలం చిన్న పాటి తగాదాలతో మనస్పర్థలు మూలంగా పట్టింపులకు పోయి కేసులు నమోదుచేసుకొని ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి నష్టపోకుండా కక్షిదారుల మధ్య రాజీ కుదర్చడం ద్వారా కేసులకు పరిష్కారం చూపుతున్నామన్నారు. తద్వార కక్షి దారుల మధ్య సత్సంబంధాలు ఏర్పడి గ్రామాలలో శాంతియుత వాతావరణం నెలకొల్పడానికి దోహదం కలుగుతుందన్నారు. రాజీ కాదగ్గ కేసులను సులభమార్గం లో లోక్ అదాలత్ చక్కటి పరిష్కారం చూపుతుందన్నారు. చెక్ బౌన్స్ కేసులలో కక్షిదారుల మధ్య సయోధ్య కుదిరితే చెల్లింపులకు దశలవారీ చెల్లింపుగడువుతో అవార్డు జారీ చేస్తామన్నారు. . . ఇరు వర్గాలనులోక్ అదాలత్ లో విచారించి దోషాలను వారికి వివరించి భవిష్యత్తులో పునరావృత్తం కారాదని హెచ్చరికలు సైతం జారీ చేస్తుండడం తో వారి లో నేర స్వభావాన్ని తగ్గించేందుకు కూడా లోక్ అదాలత్ లు దోహదపడుతున్నాయని వివరించారు. సుదీర్ఘకాలం కొనసాగుతున్న సివిల్ తగాదాలు. విభాగపు పరిష్కారకోసం కోర్టు ను ఆశ్రయించిన వారు సైతం పట్టింపులకు పోకుండా సర్దుబాటు ధోరణిలో పరిష్కరించుకునేందుకు చక్కటి అవకాశం లోక్ అదాలత్ కల్పిస్తున్నారు .తద్వారా లోక్ అదాలత్ లో సత్వర న్యాయం జరుగుతుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్జి ముజీబ్ పసపల సయ్యద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి బార్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి రాజేంద్రప్రసాద్ రెడ్డి నిడిమామిడి శ్రీనివాస్ . లెక్కల యదుభూషన్ కుంచేపు శ్రీనివాసులు నాగేంద్ర మౌనిక కిరణ్ క్రిమినల్ క్లర్క్ మంజునాథ్ సివిల్ క్లర్క్ జ్యోతిభాయి ఏం ఎల్ ఏ సి లక్ష్మానాయక్ వివిధ శాఖల బ్యాంకు మేనేజర్లు కోర్టుకానిస్టేబుల్స్ పాల్గొన్నారు

## ఉరవకొండకు జాతీయ స్థాయి గౌరవం ఎం.ఆర్.పి.ఎస్ నాయకుడు మీనుగ రాజుకు డా. బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు



రాయదుర్గం , డిసెంబర్ 13 (అనంత ప్రభ )
అనంతపురం జిల్లా, శ్రీ ఉరవకొండ మండలానికి చెందిన ప్రముఖ ఎం.ఆర్.పి.ఎస్ నాయకుడు మీనుగ రాజుకు జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక గౌరవం దక్కింది. భారతదేశ రాజధాని ఢిల్లీలో భారతీయ దళిత సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు డా. బి.ఆర్. అంబేద్కర్ ఫెలోషిప్ నేషనల్ అవార్డు అందజేశారు. భారతీయ దళిత సాహిత్య అకాడమీని పూజ్యులు శ్రీ బాబు జగ్జీవన్ రామ్ గారు, వారి అనుచరుడు శ్రీ సుమనక్షర్ గారు 1984లో స్థాపించారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, బ్యాక్‌వర్డ్ క్లాసెస్‌కు చెందిన రచయితలు, కవులు, కళాకారులు, అలాగే పేద వర్గాల కోసం స్వచ్ఛందంగా సేవలందిస్తున్న సామాజిక కార్యకర్తలకు ఈ అకాడమీ ప్రతిఏటా ప్రతిష్టాత్మక అవార్డులను అందిస్తూ వస్తోంది. బుద్ధుడు, అంబేద్కర్, జగ్జీవన్ రామ్, జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే పేర్లతో సాహితీ, సామాజిక సేవా పురస్కారాలను ప్రదానం చేయడం దీని ప్రత్యేకత.

ఈ ఏడాది డిసెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో భారతీయ దళిత సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు శ్రీ సుమనక్షర్ గారి చేతుల మీదుగా ఎం.ఆర్.పి.ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనుగ రాజు డా. బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డును స్వీకరించారు. గత మూడు దశాబ్దాలుగా ఆంధ్ర రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ల ఉపవర్గీకరణ అంశంపై నిరంతర పోరాటం, సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ దళిత హక్కుల సాధన కోసం ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ జాతీయ స్థాయి గౌరవం ఉరవకొండ మండలంతో పాటు అనంతపురం జిల్లాకు గర్వకారణంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం , డిసెంబర్ 13 (అనంత ప్రభ )
అనంతపురం. అనంతపురం ఈరోజు రుద్రంపేట లో కూటమి యమ్. యల్. ఏ. దగ్గుపాటి మరియు యమ్. పి. అంబికా లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పాల్గొన్న టీడీపీ నాయకులు కార్యకర్తలు
కోటి 40లక్షలతో ఇవాళ అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించాం
గత ఐదేళ్లలో ఒక్క పని కూడా చేయకుండా నగరాన్ని నాశనం చేశారు
ఎక్కడ చూసినా రోడ్లు, డ్రైనేజీల సమస్యలు కనిపిస్తున్నాయి
ఒకటిన్నర ఏడాదిలో కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి
రుద్రంపేట, 80ఫీట్ రోడ్డులను పూర్తి చేశాం.. ఏ రోజైనా వీటిని పట్టించుకున్నారా
నియోజకవర్గంలో ఎక్కడ సమస్య ఉన్నా ఎమ్మెల్యే స్పందిస్తున్నారు.. ఎంపీ అంబికా
గతంలో ఎప్పుడూ లేని విధంగా నగరంలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నారు
ఓ వైపు సంక్షేమ మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి
నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు
వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో నగరంలో విజయ దుందిబి మోగిస్తాం.. ఎంపీ అంబికా

## ఉరవకొండ ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్య సేవలు



ఉరవకొండ, డిసెంబర్ 13 (అనంత ప్రభ )
ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో శనివారం ఎస్సీ%-%ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎస్. హరి ప్రసాద్ యాదవ్, కౌకుంట్ల చాకరి రవి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై సమగ్రంగా పరిశీలించారు. తనిఖీల సమయంలో వైద్యులు అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని కమిటీ సభ్యులు తెలిపారు. ముఖ్యంగా ల్యాబొరేటరీలో నిర్వహిస్తున్న రక్త పరీక్షల విధానం, పరీక్షల నివేదికల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే అన్ని రకాల అవసరమైన మందులు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించారు. ఆసుపత్రి రిజిస్టర్లను కూడా కమిటీ సభ్యులు పరిశీలించి, అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్లకు అందుతున్న వైద్య సేవల వివరాలను ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చౌదరి నుండి తెలుసుకున్నారు. రోగులకు వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆయన వివరంగా వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, గతంతో పోలిస్తే ప్రస్తుతం ఉరవకొండ ప్రభుత్వ వైద్యశాలలో వైద్య సేవలు గణనీయంగా మెరుగుపడ్డాయని తెలిపారు. ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఆసుపత్రి సిబ్బంది పనిచేస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు

## దటీజ్ పవన్ కల్యాణ్.. మధ్యాహ్నం అడిగితే సాయంత్రానికి ఆర్డర్స్



మడకశిర, డిసెంబర్ 13 (అనంత ప్రభ )
మడకశిర అంధుల క్రికెట్ కెప్టెన్ దీపిక విజ్ఞప్తి.. రూ.3.20 కోట్లు మంజూరు చేసిన పవన్
తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని..
డిప్యూటీ సీఎం పవన్ ను కోరిన అంధుల క్రికెట్ కెప్టెన్ దీపిక
సాయంత్రానికి రోడ్డు నిర్మాణానికి అనుమతులిచ్చిన పవన్ కల్యాణ్
దీపిక స్వగ్రామం శ్రీ సత్య సాయి జిల్లా మడకశిర నియోజకవర్గం,తంబాలహట్టి
హేమావతి నుంచి తంబాలహట్టి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.3.20 కోట్లు మంజూరు

## జిల్లాలో విస్తృతంగా వాహనాల తనిఖీలు...

పుట్టపర్తి, డిసెంబర్ 13 (అనంత ప్రభ )
మద్యం తాగి వాహనం నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిని నివారించేందుకు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు.
ఇందులో భాగంగా శనివారం సాయంత్రం మద్యం తాగి వాహనాలు నడిపే డ్రైవర్ల వల్ల సంభవించే ప్రమాదాలను నిరోధించేందుకు ఈ తనిఖీలు విస్తృతంగా చేపడుతున్నారు.
అనుమానాస్పద వాహనాలను ఆపి బ్రీత్ అనలైజర్‌తో చెక్ చేశారు.
డ్రంకెన్ డ్రైవ్ లో పట్టుబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రయాణికుల భద్రత కోసం ట్రాఫిక్ నియంత్రణను కూడా కట్టుదిట్టం చేశారు.
రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు రోజూ క్రమం తప్పకుండా చేపడుతున్నారు.







# దోసకాయ వలన కలిగే అద్భుత ప్రయోజనాలు

దోసకాయలు ఆరోగ్యానికి అవసరమయ్యే అనేక ముఖ్యమైన విటమిన్లు మరియు ఖనిజాల యొక్క గొప్ప మూలం. వీటిలో ముఖ్యంగా విటమిన్ సి, విటమిన్ కె మరియు పొటాషియం అధికంగా ఉంటాయి, ఇవన్నీ శరీరంలో ముఖ్యమైన పాత్రలను పోషిస్తాయి.


విటమిన్ సి అనేది యాంటీఆక్సిడెంట్, ఇది హానికరమైన ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతుంది మరియు రోగనిరోధక పనితీరును కూడా మెరుగుపరుస్తుంది. విటమిన్ కె ఎముకల ఆరోగ్యానికి ముఖ్యమైనది మరియు రక్తం గడ్డకట్టడంలో సహాయపడుతుంది. పొటాషియం ఒక ఖనిజం, ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది.

దోసకాయలు విటమిన్ ఎ, విటమిన్ బి6 మరియు మెగ్నీషియం వంటి ఇతర పోషకాలను కలిగి ఉంటాయి, అలాగే ఫైబర్, ఆరోగ్యకరమైన జీర్ణక్రియను నిర్వహించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది.

**దోసకాయలోని ఆరోగ్య ప్రయోజనాలు**

**మెరుగైన జీర్ణక్రియ:** దోసకాయలలో ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది సాధారణ ప్రేగు కదలికలను ప్రోత్సహించడంలో సహాయపడుతుంది మరియు మలబద్ధకాన్ని నివారిస్తుంది. దోసకాయలో నీరు ఎక్కువగా ఉంటుంది, ఇవి మలం మృదువుగా మరియు సులభంగా బయటకు వెళ్లడానికి సహాయపడతాయి.

**హైడ్రేషన్:** దోసకాయలు 95% కంటే ఎక్కువ నీటిని కలిగి ఉంటాయి, ఇవి హైడ్రేట్‌గా ఉండటానికి మంచి మార్గం. దోసకాయలు తినడం వలన మీరు రిఫ్రెష్ భావనను మరియు శక్తిని పొందవచ్చు, ముఖ్యంగా వేడి వాతావరణంలో లేదా వ్యాయామం తర్వాత తీసుకోవడం చాలా మంచిది.



**బరువు తగ్గడం:** దోసకాయలలో కేలరీలు తక్కువగా ఉంటాయి. నీరు మరియు ఫైబర్ అధికంగా ఉండటం వలన, ఇది ఎక్కువ కేలరీలు తీసుకోకుండా మీరు పూర్తి మరియు సంతృప్తిగా అనుభూతి చెందడానికి సహాయపడుతుంది. ఇది బరువు తగ్గడం లేదా బరువు పెరగటానికి ఆహారంలో భాగంగా చేసుకోవడం ఉత్తమం.

**మెరుగైన చర్మ ఆరోగ్యం:** దోసకాయలు చర్మ సంరక్షణ ఉత్పత్తులలో ప్రముఖమైన పదార్థం, ఎందుకంటే వాటిలో విటమిన్ సి మరియు కెఫిక్ యాసిడ్ ఉన్నాయి, ఇవి చర్మపు చికాకు మరియు మంటను తగ్గించడంలో సహాయపడతాయి. దోసకాయలను తినడం వల్ల హైడ్రేషన్ మరియు ముఖ్యమైన పోషకాలను అందించడం ద్వారా చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

**ఉబ్బరం తగ్గించడం :** దోసకాయలు శీతలీకరణ ప్రభావాన్ని కలిగి ఉంటాయి, ఇవి కళ్ల చుట్టూ ఉబ్బిన ప్రాంతాన్ని తగ్గిస్తాయి. అందుకే మీరు స్పాలలో లేదా సినిమాల్లో కళ్లపై దోసకాయ ముక్కలను ఉపయోగించడం తరచుగా చూస్తారు.

**దోసకాయతో అందం మెరుగు పరుచుకోవడం ఎలా?**

దోసకాయలు మీ ఆరోగ్యానికి మాత్రమే కాదు, మీ చర్మం మరియు జుట్టుకు కూడా మేలు చేస్తాయి. దోసకాయల యొక్క కొన్ని సౌందర్య ప్రయోజనాలు ఇక్కడ తెల్సుకుందాం:

**చర్మ సంరక్షణ:**

దోసకాయలు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉండే సమ్మేళనాలను కలిగి ఉంటాయి మరియు చికాకు లేదా ఎర్రబడిన చర్మానికి ఉపశమనం కలిగి ఇస్తాయి. దోసకాయ ముక్కలు లేదా రసాన్ని చర్మానికి అప్లై చేయడం వల్ల ఎరుపు మరియు చికాకు తగ్గుతుంది.

# గోరింటాకు ఎర్రగా పండటానికి అరుదైన చిట్కాలు



మహిళలు గోరింటాకు ఎర్రగా పండాలని కోరుకుంటారు గోరింటాకు ఎంత ఎర్రగా పండితే అంత మంచి మొగుడు వస్తాడని చాలామంది నమ్మకం అయితే గోరింటాకు ఎర్రగా అందంగా పండాలి అంటే ఏం చేయాలి అనే ప్రశ్న మన మనస్సులో రావచ్చు. ఈ వ్యాసంలో మీ కోసం గోరింటాకు- మెహందీ ఎలా ఎర్రగా పండేలా చేయాలి అనే దానికి ప్రతిస్పందనగా చక్కని అరుదైన చిట్కాలు

గోరింటాకు పెట్టుకునే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. తర్వాత చేతికి ఎలాంటి తడి లేకుండా చూసుకుని తర్వాత మీకు ఇష్టమైన డిజైన్‌ను మీ చేతుల్లో అలంకరించుకోండి. ఏడు నుంచి ఎనిమిది గంటలు అలాగే ఉంచండి. మీరు గోరింటాకు 12 గంటలు అలాగే ఉంచవచ్చు. అదే సమయంలో గోరింటాకు (మెహందీ) తీసినపుడు చాలామంది నీటితో సబ్బుతో కడుగుతారు అలా కాకుండా నీళ్ల లేదా ఎలాంటి సబ్బు ఉపయోగించకుండా గోరింటాకు ఎండు పోయిన తర్వాత గోరింటాకును అర చేతులను కలిపి రుద్దడం ద్వారా గోరింటాకును తొలగించండి. గోరింటాకు పూర్తిగా తొలగించే వరకు ఇలా చేయండి. ఇలా చేయడం ద్వారా మీరు కొన్ని గంటల ప్రభావాన్ని చూస్తారు మరియు మీరు మెహందీ ఎర్రగా అందంగా ఎక్కువ కాలం ఉంటుంది.

**మెహందీ గోరింటాకు నిమ్మ-చక్కెర రసం**

నిమ్మకాయ-చక్కెర గోరింటాకు రంగును ఎర్రగా చేయడానికి సులభమైన మార్గం. నీటిలో కొద్దిగా చక్కెర ఉడకబెట్టి ఈ మిశ్రమం చల్లారిన తర్వాత ఒక గిన్నెలో తీసుకొని దానికి కొన్ని చుక్కల నిమ్మరసం కలపండి. గోరింటాకు ఎండిన తర్వాత ఈ మిశ్రమాన్ని రాయండి. చక్కెర గోరింటాకు చర్మంపై ఎక్కువసేపు ఉండటానికి సహాయపడుతుంది, నిమ్మరసం మెహందీ రంగును మరింత లోతుగా చేస్తుంది. మెహందీ ఆరడం ప్రారంభించినప్పుడు మీరు నిమ్మ-చక్కెర రసాన్ని రాయాలి తద్వారా గోరింటాకు -మెహందీ మీ చేతుల్లో ఎక్కువసేపు ఉంటుంది మరియు గోరింటాకు రంగుని మీ చేతుల మీదకి ఇంకెలా చేసి దాని అందాన్ని కూడా పెంచుతుంది.

# అధిక రక్తపోటును అదుపులో ఉంచాలా?

## పాలలో ఇది కలుపుకొని తాగండి

ప్రపంచంలో అధిక శాతం మంది హైపర్ టెన్షన్ లేదా హైబీపీతో బాధపడుతున్నట్టు అంచనా. చాలామందిలో హై బీపీ తీవ్ర స్థాయికి చేరుకునే వరకు పట్టించుకోరు. ఆ తర్వాత వైద్యుడు వద్దకు పరుగులు తీస్తారు. తలనొప్పి, జ్వరం, ఒళ్ళు నొప్పులు, దగ్గు వంటివి బీపీ పెరిగితే కనిపించే లక్షణాలు. ఒకప్పుడు వయసు పెరిగాక మాత్రమే హైబీపీ వచ్చేది. ఇప్పుడు 18 ఏళ్ల వయసు నుంచి కూడా హైపర్ టెన్షన్ లక్షణాలు కనిపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ప్రతి ముగ్గురిలో ఒకరికి హైబీపీ ఉంటున్నట్టు వైద్యుల అంచనా.

ఇది ఎందుకు వస్తుందో కచ్చితంగా చెప్పలేము. వంశపారంపర్యంగా కూడా హైపర్ టెన్షన్ వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆధునిక కాలంలో ఆరోగ్యకరమైన ఆహారం తినడం తగ్గించేసింది యువత. ప్రాసెస్డ్ ఫుడ్, పిజ్జాలు, బర్గర్లు, నిల్వచేసిన మాంసం, కూల్ డ్రింకులు, ఫ్రిజ్ లో ఎక్కువ కాలం నిల్వ చేసిన పదార్థాలు తినడం వల్ల కూడా హైబీపీ వస్తున్నట్లు అంచనా. ఉప్పు అధికంగా వాడడం వల్ల హై బీపీ త్వరగా వచ్చేస్తుంది. టెన్షన్ కూడా హైబీపీ వచ్చే అవకాశాన్ని పెంచుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ లో ఎక్కువగా తిరిగేవారు ఈ టెన్షన్ బారిన పడుతున్నారు.

ఆయుర్వేదం ప్రకారం అధిక రక్తపోటు వాత, పిత్త, కఫ అనే మూడు దోషాలలో అసమతుల్యత వల్ల వస్తుంది. శరీరంలో టాక్సిన్స్ చేరడం, చెడు జీవనశైలి, వ్యాయామం లేకుండా నిశ్చలంగా ఉండడం, జీవక్రియ సరిగా జరగకపోవడం వంటివి కూడా అధిక రక్తపోటుకు కారణాలు. అయితే ఆయుర్వేదంలో అధిక రక్తపోటును నియంత్రణలో ఉంచే ఒక అద్భుత ఔషధం ఉంది.

ఇదొక్కటి చాలు

హైబీపీ బారిన పడినవారు దాన్ని అదుపులో ఉంచాలనుకుంటే ఆయుర్వేదం చిట్కాను సూచిస్తోంది. ప్రతిరోజు ఉదయం పాలలో రెండు మూడు గ్రాముల అర్జున బెరడు పొడిని కలుపుకొని తాగాలి. ఇది రక్తపోటును తగ్గించడమే కాదు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే శక్తివంతమైన ఔషధం.

దీన్ని ఎలా చేయాలంటే

ఈ పానీయాన్ని ఇంట్లో సులభంగా చేసుకోవచ్చు. ముందుగానే అర్జున చెట్టు బెరడు పొడిని కొని ఇంట్లో పెట్టుకోవాలి. ఒక కప్పు పాలను మరిగించి గోరువెచ్చగా ఉన్నప్పుడు ఈ పొడిని వేయాలి. ఇలా రోజుకు



రెండుసార్లు ఈ పాలను తాగడం వల్ల మార్పు మీకే కనిపిస్తుంది. రక్త పోటు అదుపులో ఉంటుంది. అలాగే తాజా ఆకుకూరలు, కూరగాయలు తింటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. దీని వల్ల రక్తపోటు పెరగదు. అర్జున చెట్టు ఎక్కడైనా కనిపిస్తే దాని బెరడు ఒలిచి ఎండబెట్టుకుని పొడి చేసి దాచుకోండి.

# తలనొప్పిగా ఉందా? ఈ చిట్కా పాటిస్తే పెయిన్ కిల్లర్‌తో పనే ఉ



తలనొప్పి అత్యంత సాధారణమైన సమస్య. లోకంలో చాలా మంది మైగ్రేన్ లేదంటే టెన్షన్ వల్ల కలిగే తలనొప్పితో బాధ పడుతున్నారని నార్వేజియన్ నిపుణులు ఒక అధ్యయనం ద్వారా కనుగొన్నారు. పారాసిటమాల్, ఐబుప్రొఫిన్ లేదా ఆస్పిరిన్ వంటి సాధారణ పెయిన్ కిల్లర్స్ తలనొప్పి తగ్గించేందుకు విరివిగా వాడుతున్నారని కూడా అంటున్నారు. ఈ నేపథ్యంలో పలువురు వైద్య నిపుణులు పెయిన్ కిల్లర్ వాడకుండా తలనొప్పి తగ్గించుక□నే మార్గాలను వివరించారు.

మెడ కండరాలు బిగుసుకు పోవడం వల్ల కూడా తలనొప్పి వస్తుంది. ఇలాంటి తలనొప్పి తగ్గించుకోవడానికి మెడ కండరాలకు మంచి మసాజ్ ఇస్తే సరిపోతుందట. చాలా సార్లు ఈ చిన్న చిట్కాతో తలనొప్పి తగ్గిపోతుందట. కొన్ని నిమిషాలు కేటాయిస్తే చాలు మెడ కండరాలు బలోపేతం అవుతాయి. మెడ కండరాలు బలంగా ఉంటే తలనొప్పి రాకుండా నివారించవచ్చు. తల మీద చేతిని ఉంచి తలను పక్కకి పది సెకండ్ల పాటు నొక్కి ఉంచడం వల్ల మెడ కండరాలు బలం సంతరించుకుంటాయి.

నీళ్లు ఎక్కువ తాగాలి

డీహైడ్రేషన్ కూడా తలనొప్పికి కారణం అవుతుందని గుర్తుంచుకోవాలి. రోజులో తగినన్ని నీళ్లు తాగడం తప్పనిసరి. కనీసం రోజుకు ఎనిమిది గ్లాసుల నీళ్లు తాగాలి. ఇలా తగినన్ని నీళ్లు తాగడం వల్ల శరీరం హైడ్రేటెడ్ గా ఉండడం మాత్రమే కాదు, మెదడు కణజాలాలు కూడా ఆరోగ్యంగా, కుంచించుకు పోకుండా ఉంటాయి. మెదడు కణజాలం కుంచించుకు పోతే పుర్రెనుంచి దూరంగా జరగడం వల్ల నాడులు లాగినట్టయి తలనొప్పి వస్తుంది. అలా జరగకూడదంటే తప్పనిసరిగా తగినన్ని నీళ్లు తాగాలి.

సరిపడా నిద్ర తప్పనిసరి

తిండి, నిద్ర, శ్రమ, జీవిత నాణ్యతను నిర్ణయిస్తాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో ఏది తగ్గినా ఆరోగ్యానికి మంచిది కాదు. నిద్ర సరిపడినంత లేకపోతే మొదట కనిపించే లక్షణం తలనొప్పే. 18 నుంచి 80 సంవత్సరాల మధ్య వయసున్న అందరూ 6 నుంచి 11 గంటల పాటు నిద్ర పోవాల్సిందేనని నిపుణులు సలహా ఇస్తున్నారు. కనీసం 7 నుంచి 9 గంటల పాటు నిద్రపోవాల్సి ఉంటుందట. నిద్ర శరీరానికి విశ్రాంతిని ఇచ్చి మెదడు తిరిగి రెజువనేట్ కావడానికి దోహదం చేస్తుంది. అందువల్ల తలనొప్పి రాకుండా చేస్తుంది.

# పిసిఓఎస్ సమస్యతో బాధపడే మహిళలు తినాల్సిన, తినకూడని ఆహార పదార్థాల జాబితా ఇదిగో



పిసిఓఎస్ సమస్యతో బాధపడే మహిళలకు ఏం తినాలి? అన్న విషయంలో చాలా సందేహాలు ఉంటాయి. పిసిఓఎస్ లేదా పాలీ సిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ అనేది ప్రపంచవ్యాప్తంగా 10 శాతం కంటే ఎక్కువ మంది మహిళలను వేధిస్తున్న హార్మోన్ల రుగ్మత. పిసిఓఎస్ ఉన్న మహిళల్లో ఆండ్రోజన్ హార్మోన్ అధిక స్థాయిలో ఉత్పత్తి అవుతుంది. ఇది ఒక మగ హార్మోను. ఇది ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగిపోతాయి. అంతేకాదు టైప్2 డయాబెటిస్, రక్తపోటు, డిప్రెషన్ వంటివి వీరిలో త్వరగా వస్తాయి. జుట్టు అధికంగా పెరగడం, మొటిమలు రావడం, బరువు త్వరగా పెరగడం, పీరియడ్స్ సరిగా రాకపోవడం వంటివి కూడా వీరిలో ఎక్కువగా కనిపిస్తాయి. గర్భం ధరించడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. అందుకే పిసిఓఎస్ సమస్యతో బాధపడుతున్న మహిళలు ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు పాటించాలి.

పాలకు బదులు

ఈ సమస్యతో బాధపడుతున్న మహిళలు పాల వినియోగం వల్ల మరింతగా ఇబ్బంది పడే అవకాశం ఉంది. 2013లో చేసిన అధ్యయనం ప్రకారం తక్కువ పాల ఉత్పత్తులను తీసుకునే వారితో పోలిస్తే, ఎక్కువ మొత్తంలో పాల ఉత్పత్తులను వినియోగించే పిసిఓఎస్ స్త్రీలు ఇన్సులిన్ నిరోధకతను అధికంగా కలిగి ఉంటారు. అయితే వ్యక్తికి వ్యక్తికి ఈ ఫలితం భిన్నంగానే ఉన్నట్టు కూడా అధ్యయనం చెప్పింది. పాల ఉత్పత్తులు మీకు సరిపడకపోతే ప్రత్యామ్నాయంగా ఓట్స్ పాలు, బాదం పాలు, సోయా పాలను ఎంచుకోవడం మంచిది. పనీర్‌కు బదులుగా సోయాతో చేసిన టోఫూను తినవచ్చు.


ఉడికించినవే

వేయించిన ఆహారాలు, కాల్చిన ఆహారాలలో ట్రాన్స్ ఫ్యాట్స్ అధికంగా ఉంటాయి. క్యాలరీలు కూడా ఎక్కువే. వీటిని తినడం వల్ల పిసిఓఎస్ సమస్య పెరుగుతుంది. ఇన్సులిన్ నిరోధక శక్తి మరింతగా దిగజారుతుంది. కాబట్టిపిసిఓఎస్ సమస్యతో బాధపడుతున్న మహిళలు వేయించిన, కాల్చిన ఆహారాలకు దూరంగా ఉండాలి. ఉడికించిన ఆహారాన్ని ఎప్పుడు ఎంచుకోవాలి.

AP 4PG 14 12 2025 SUNDAY qxp_Layout 1 14-12-2025 06:14 AM Page 4



# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?

కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




## చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..


ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.

అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు. పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?

సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలేసుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీ పురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికీ.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్ట్స్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యూరిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మాత్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభిప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com